# గులాబి

పూలల్లో గులాబీని రాణి పువ్వుగా పిలుస్తారు. గులాబీ పూల నుంచి సుగంధ తైలం మరియు పువ్వురెక్కలతో గులఖండ్ అనే పదార్ధం కూడా తయారుచేస్తారు.

**రకాలు:** సాగులో నున్న గులాబీలను ఈ క్రింది విధంగా విభజించవచ్చు.

**హైబ్రిడ్ టీస్ :** మొక్కలు పెద్ద గులాబీలను కొమ్మకు ఒక్కటిగా పూస్తాయి.

ఉదా: గ్లాడియేటర్, కార్డినాల్, ఎటర్న, పింకపీస్

**ఫ్లోరిబండాస్ :** గులాబీలు మధ్యంతర సైజులో గుత్తులుగా పూసి ఎక్కువ రోజులుంటాయి.

ఉదా: ల్యాటిన్, రెడ్‌ట్రెంప్, వీపింగ్ చైనాడాల్.

**మీనియేచర్:** మొక్కలు చిన్నవిగా, చిన్న ఆకులు కలిగి అతి చిన్న పూలను పూస్తాయి.

ఉదా: పింక్ స్ప్రే, నర్తకి, ప్రీతి

**పాలియాంతాస్:** చిన్న చిన్న పూలు వేసవిలో పూస్తాయి. మొక్కలు హెడ్జింగ్‌కు అనువైనవి.

**తీగ గులాబీలు:** మొక్కలు తీగులుగా పెరిగి పూలు చిన్నవిగా, గుత్తులుగా పూస్తాయి.

**వాతావరణం:** సూర్యరశ్మి బాగా కలిగిన వాతావరణం అనువైనది. ఉష్ణోగ్రత హెచ్చుతగ్గులు పూల దిగుబడి నాణ్యతపై మిక్కిలి ప్రభావం చూపుతాయి. పగటి ఉష్ణోగ్రత $30^0$ సెల్సియస్ మరియు రాత్రి $15^0$ సెల్సియస్ అనుకూలం. $18^0$ సెల్సియస్ వద్ద గులాబీలలో రంగు అభివృద్ధి చాలా బాగుంటుంది. గులాబీలను నీడపడకుండ వుండే ప్రదేశాల్లో పెంచాలి. నీడ ఎక్కువగా వున్నట్లైతే తెగుళ్ళ బెడద ముఖ్యంగా బూడిద తెగులు ఎక్కువగా వుంటుంది. అంతే కాకుండ మొక్కలు సన్నగా, బలహీనంగా వుంటాయి.

**నేలలు :** తేలిక నేలలు అనువైనవి. నేల ఉదజని సూచిక 6.5–7.5 వుంటే మంచిది. బరువైన నీరు యింకని నల్లనేలలు గులాబి సాగుకు అనుకూలం కాదు.

**ప్రవర్ధనం :** శాఖీయంగా కొమ్మ కత్తిరింపులు, బడ్డింగ్ ద్వారా ప్రవర్ధనం చేస్తారు.వాణిజ్య సరళిలో టీ బడ్డింగ్ ద్వారా ద్వారా ప్రవర్ధనం చేస్తారు. బడ్డింగ్ చేయటానికి ఎంపిక చేసుకొన్న గులాబీ రూట్‌స్టాక్ మొక్కపై భూమి నుంచి షుమారు 10–15 సెం.మీ. ఎత్తున వుండేటట్లు బడ్డింగ్ చేయుట మంచిది.

**నాటేదూరం :** నేల స్వభావాన్ని మరియు రకాన్ని బట్టి 75–120సెం.మీ. ఎడంగా నాటాలి. ఎకరాకు 6000 నుండి 7000 మొక్కలు అవసరమవుతాయి.

**నాటే సమయం:** గులాబీ మొక్కలను జూన్ నుంచి జనవరి వరకు నాటుకోవచ్చు. అయితే సెప్టెంబర్–అక్టోబరు మాసాల్లో నాటడం మంచిది.

**నీటియాజమాన్యం:** మొక్కలను నాటిన తర్వాత కొత్త చిగుళ్ళు వచ్చే వరకు తేలికపాటి నీటి తడులను యిచ్చి, అటు పిమ్మట అవసరాన్ని బట్టి 8–10 రోజుల వ్యవధితో నీటి తడులు యివ్వాలి. డ్రిప్ పద్ధతి ద్వారా కూడా నీటి యాజమాన్యం చేపట్టి నీటిని ఆదా చేయవచ్చు.

**కత్తిరింపులు :** గులాబీ పూలు క్రొత్త చిగుర్లపైన పూస్తాయి. కాబట్టి కొమ్మ కత్తిరింపులు తప్పని సరిగా చేయాలి. సంవత్సరానికి ఒకసారి అంటే మన రాష్ట్రంలో వర్షాకాలం అయిపోయిన తరువాత అక్టోబర్-నవంబర్ మాసాల్లో కొమ్మకత్తిరింపులు చేయుటకు అనుకూలం. కొమ్మలను కత్తిరించునపుడు చనిపోయిన, ఎండిపోయిన కొమ్మలను, తెగులు లేక పురుగు ఆశించిన కొమ్మలను, బలహీనంగా వున్న కొమ్మలను, రూటుస్టాక్ పైన వచ్చే జిగురును, కొమ్మలను వెంటనే కత్తిరించాలి. ఆరోగ్యంగా, బలంగా వున్న కొమ్మలపై తగినంత ఎత్తులో వెలుపలి వైపు వున్న మొగ్గకు షుమారు 5 మి.మీ. పైన పదునైన సికేచరుతో కొమ్మలను కత్తిరించాలి.

**ఎరువులు:** కొమ్మలను కత్తిరించిన తర్వాత ప్రతి మొక్కకు 7-8 కిలోల పశువుల ఎరువు మరియు 3 నుండి 5 కిలోల వేరుశనగ/ వేపపిండి చెక్కను వేయాలి. తదుపరి 15 లేక 20 రోజుల పిమ్మట యూరియా, భాస్వరం, పొటాష్ ఎరువులను 1:8:3 నిష్పత్తిలో ప్రతి మొక్కకు 100గ్రా. చొప్పున వేయాలి. ఇదే మోతాదును రెండు, మూడు దఫాలుగా వేయాలి. సూక్ష్మ ధాతువులయిన మాంగనీస్ సల్ఫేట్ 15గ్రా., మెగ్నీషియం సల్ఫేట్ 20గ్రా., ఛిలేటెడ్ ఇనుము 10గ్రా., బోరాక్స్ 5గ్రా. కలిగిన మిశ్రమాన్ని 2గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**పూత, దిగుబడి :** వాణిజ్యపరంగ సాగుచేసిన గులాబీలు నాటిన 2వ సం॥తర్వాత మొదలై 7-8 సంవత్సరాల వరకు పూస్తాయి. 3సంవత్సరాల మొక్క 300 గులాబీల వరకు పూస్తుంది. మార్కెట్ కొరకు గులాబీలు సగంగా విచ్చుకొన్నపుడు కోయాలి.

**సస్యరక్షణ**

**పురుగులు**

**పెంకు పురుగులు :** రాత్రిపూట ఆకులను వంకరటింకరగా కొరికి తినివేస్తాయి. నివారణకు మలాథియాన్ 5 శాతం పొడిని 15 కిలోల సాయంత్రం సమయంలో చల్లాలి.

**పేను :** ఈ పురుగుల ఉధృతి ఎక్కువగా వున్నచో ఆకుల కొనలు మరియు మొగ్గ నల్లగా మారుతాయి. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ఎర్రనల్లి :** వాతావరణం వేడిగా ఉన్న రోజుల్లో ఉధృతంగా ఉంటుంది. దీనివలన మొత్తం మొక్క ఆకులు రాలిపోతాయి. నివారణకు 3గ్రా. నీటిలో కరుగు గంధకం లేదా డైకోఫాల్ 5మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తెగుళ్ళు**

**బూడిద తెగులు :** ఆకులపై బూడిదవంటి తెల్లటి పదార్థమేర్పడి ఆకులు ముడుచుకొనిపోతాయి. లేత కొమ్మల నిండా బూడిద సోకి ఎండిపోతాయి. పూల రేకులు రంగు మారి వడలి, ఎండిపోతాయి. నివారణకు డైనోకాప్ 1మి.లీ. లేదా కార్బండైజిమ్ 1.0గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేసి నివారించవచ్చు.

**నల్లమచ్చలు:** గుండ్రటి నల్లటి మచ్చలు ఆకులకు రెండు ప్రక్కలా వ్యాపించడం వల్ల ఆకులు రాలిపోతాయి. వర్షాకాలంలో ఈ తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. నివారణకు కాప్టాను 2గ్రా. లేదా మాంకోజెబ్ 2గ్రా. లేదా కార్బండైజిమ్ 1గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**ఎండురోగం :** మొక్క పైభాగం నుండి క్రిందకు ఎండిపోతుంది. ఈ తెగులు ముందుగా కత్తిరించిన కొమ్మ నుండి మొదలవుతుంది. తెగులు సోకిన కొమ్మలు నలుపు రంగుకు మారుతాయి. కాండం, వేర్లు గోధుమ రంగుకు మారిపోతాయి. నివారణకు ప్రూనింగు చేసిన (కత్తిరింపు) కొమ్మకు వెంటనే రాగి ధాతు సంబంధమైన మందును (బ్లైటాక్స్) పేస్ట్‌లాగా చేసి కత్తిరించిన ప్రదేశాల్లో పూయాలి లేదా పచ్చిపేడ మరియు మట్టితో కలిపిన పేస్టు పూసి కూడా ఈ తెగులును కొంతవరకు నివారించవచ్చు.